E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD | సంపుటి :01 | సంచిక :310 | సోమవారం 19 అక్టోబర్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## ఏపీని సౌత్ బీహార్ చేస్తున్నారు: షర్మిల!




టీడీపీ, వైసీపీలవి ప్రతీకార రాజకీయాలు

ఎన్నికల వేళ హింసపై షర్మిల ఫైర్

రాయచోటి, పుంగనూరు ఘటనలపై ఆగ్రహం

నామినేషన్లు అడ్డుకోవడంపై నిలదీత

ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై విమర్శలు

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

## సర్వీసు రికార్డులపై సర్కారు ఫోకస్!

ఆన్‌లైన్‌లో ఉద్యోగుల రికార్డులు

రిటైర్మెంట్ వరకు డిజిటల్ వివరాలు

సెలవులు, ఇంక్రిమెంట్లు ఆన్‌లైన్‌లోనే

బదిలీలు, పదోన్నతులకు డిజిటల్ విధానం

పెండింగ్ ఫైళ్లపై నిఘా

పరిపాలనలో మరింత పారదర్శకత

అమలుపై ఆర్థిక శాఖ పర్యవేక్షణ




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సర్వీసు వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ సమగ్ర ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ పరిధిలో రూపొందించిన ఎలక్ట్రానిక్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈ-హెచ్‌ఆర్‌ఎంఎస్)ను అమల్లోకి తీసుకొస్తూ ఆర్థిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయంలోని అన్ని శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, క్షేత్రస్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు ఈ విధానాన్ని వర్తింపజేయనున్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఉద్యోగుల సర్వీసు వివరాల నిర్వహణ మరింత సులభతరం కావడంతో పాటు పరిపాలనలో పారదర్శకత, వేగం పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల సర్వీసు రికార్డులు భౌతిక దస్త్రాల రూపంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో అవసరమైన వివరాలను సేకరించడం, పరిశీలించడం, ఒక శాఖ నుంచి మరో శాఖకు సమాచారాన్ని బదిలీ చేయడం వంటి ప్రక్రియల్లో జాప్యం జరుగుతోంది. వివిధ శాఖల్లో రికార్డుల నిర్వహణకు వేర్వేరు విధానాలు అనుసరిస్తుండటంతో ఉద్యోగుల వివరాల సమన్వయం, పెండింగ్ వ్యవహారాల పర్యవేక్షణలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## ఎర్రజెండాలన్నీ ఏకమైతే.. గెలుపు మనదే!

కమ్యూనిస్టుల ఐక్యతతోనే గెలుపు: కూనంనేని

విడివిడిగా పోటీ చేస్తే విజయం కష్టమే

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిజం

ఎన్నికల్లో డబ్బు ప్రభావమే ఓటమికి కారణం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కీలక వ్యాఖ్యలు

కమ్యూనిస్టుల ఐక్యతపై తెలంగాణ రాజకీయాల్లో చర్చ

ఎర్రజెండాలన్నీ ఏకం కావాలని పిలుపు

2 లో

## స్పెషల్ బస్సుల పేరుతో నిలువు దోపిడీ!

పండుగ వస్తే ఛార్జీల బాదుడేనా?

ఆర్టీసీ టికెట్ ధరలపై హరీశ్ ఫైర్

స్పెషల్ బస్సుల పేరుతో నిలువుదోపిడీ

రూ.230 టికెట్ రూ.400కు పెంపు

రెగ్యులర్ బస్సులకే స్పెషల్ బోర్డులా?

భార్యకు ఫ్రీ.. భర్తకు డబుల్ ఛార్జీ

మూడేళ్లలో ఐదుసార్లు టికెట్ ధరల పెంపు

పెంచిన పండుగ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** పండుగల వేళ ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరిట ఛార్జీలను రెండింతలు చేసి వసూలు చేస్తుండటంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్ వేదికగా ఫైరయ్యారు. పండుగలు వస్తే చాలు.. ఇష్టానుసారం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజల్ని బాదుడేనా? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బతుకమ్మ, దసరా పండుగవేళ ప్రజలకు కానుకలు ఇవ్వాల్సింది పోయి.. టికెట్ ధరలను డబుల్ చేసి నిలువుదోపిడీ చేయడం సిగ్గుచేటన్నారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దుర్మార్గమని దుయ్యబట్టారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్ కు రూ.230 ఉండే టికెట్ ను ఏకంగా రూ.400కు పెంచారని, మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు మొన్నటివరకు రూ.220 ఉండగా.. ఇప్పుడు రూ.290 పైగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారన్నారు.

## నూడుల్స్ మిస్టరీలో కొత్త కోణం!

ఐదుగురి మరణాల వెనుక విషప్రయోగం?

వాంతులు, విరేచనాల జాడలేవు

నూడుల్స్ వండిన తల్లిపైనా అనుమానాలు

ఆస్తుల బదిలీతో కుటుంబంలో కలహాలు

తల్లి, బంధువులను విచారిస్తున్న పోలీసులు

ఫోరెన్సిక్ నివేదికలతోనే మిస్టరీ వీడేనా?

2 లో

## కోల్‌కతా తొక్కిసలాట

### ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు!

తొక్కిసలాటలో 19 మంది మృతి

మృతుల కుటుంబాలకు ఉద్యోగం

నిర్వాహకులతో సహా ఏడుగురి అరెస్ట్

హైకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు

లౌడ్‌స్పీకర్ ప్రకటనతోనే తొక్కిసలాట?

విజిల్స్‌తో భక్తుల్లో ఒక్కసారిగా కదలిక

క్షతగాత్రుల వైద్య ఖర్చులు ప్రభుత్వానివే

థీమ్‌ల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యం

2 లో

# మద్దతు రాజకీయం మస్తు టెన్షన్!




- సీపీఎం మద్దతుపై పార్టీల్లో ఉత్కంఠ
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు సీపీఎం షాక్?
- ఎమ్మెల్సీ పోరులో వామపక్షాలదే కీలకం
- సీపీఎం నిర్ణయంతో పార్టీల్లో టెన్షన్
- మద్దతు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ
- దసరా తర్వాతే సీపీఎం కీలక నిర్ణయం
- సీపీఎం మద్దతుపై కొనసాగుతున్న సస్పెన్స్
- పోటీనా, మద్దతా.. సీపీఎం వ్యూహమేంటి?
- వామపక్షాల మద్దతుతో గెలుపు లెక్కలు

**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాల మద్దతు కీలకంగా మారనుంది. ప్రతి ఓటూ కీలకమే కావడంతో సీపీఎం, సీపీఐ, ఇతర వామపక్షాల పార్టీల మద్దతును కూడగట్టే పనిలో ప్రధాన రాజకీయ పార్టీలు ఉన్నాయి. సీపీఎం, సీపీఐకి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కేడర్, ఓటు బ్యాంకు ఉంది. ఈ నేపథ్యంలో వారి మద్దతు పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలకమవుతాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి మద్దతు కోసం తీవ్రంగా యత్నిస్తున్నాయి. కాంగ్రెస్ ఈ రెండు స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే సంకల్పంతో ఇప్పటికే పార్టీ అభ్యర్థులుగా సామ రామ్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ప్రకటించింది. మద్దతు కోసం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్వయంగా సీపీఎం ఆఫీసుకు వెళ్లగా, బీఆర్ఎస్ నేతలు సైతం వారిని సంప్రదించినట్టు తెలిసింది

మిగతాది 2 లో..

## ఉద్యోగుల శ్రమను దోచుకుంటే ఊరుకోం!




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ఎం) ఉద్యోగుల జీతాలు తగ్గిస్తూ ప్రభుత్వం జీవో 1195 తేవడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులతో కలిసి ఆదివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల ఉద్యోగులుంటే వారిలో కొంతమంది వేతనాలు రూ. 4 వేల నుంచి రూ.5 వేలు తగ్గించారని అన్నారు. ఒక వైపు ధరలు పెరుగుతూ, కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని.. ద్రవ్యోల్బణం నానాటికి పెరుగుతూ ఉంటే ఉద్యోగుల జీతాలు తగ్గిస్తారా అని ప్రశ్నించారు.

## భక్తులపైకి ట్రక్కు... 12 మంది బలి!




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో 12 మంది దుర్మరణం చెందారు. 39 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన గ్వాలియర్ జిల్లాలో శీతలా మాత ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈప్రమాదంలో భక్తులు అక్కడికక్కడే మరణించారు.

## చంద్రబాబు కనుసన్నల్లో ఎస్ఈసీ

నామినేషన్ల అడ్డగింతపై వైఎస్ జగన్ ఫైర్

అభ్యర్థులను బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు

24 గంటల్లో నామినేషన్ల ప్రక్రియ ఎలా?

ఆర్ఓలు నామినేషన్లు తీసుకోవడం లేదని విమర్శ

గత ఎన్నికల్లో 13 కార్పొరేషన్లలో గెలిచాం

పుంగనూరు ఘటనపై జగన్ సంచలన ఆరోపణలు




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా చట్టం మచ్చుకైనా కనిపించడం లేదని ఆరోపించిన ఆయన, జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని వ్యాఖ్యానించారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ మూకలు మోహరించి తమ పార్టీ అభ్యర్థులను అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే పనిచేస్తోందని వైఎస్ జగన్ ఆరోపించారు.

## నేనే హోంమంత్రిని అంబటి వార్నింగ్!




రెండేళ్లలో మా ప్రభుత్వమే: అంబటి

అంబటి వ్యాఖ్యలు.. ఏపీలో హాట్‌టాపిక్

హోంమంత్రి పదవిపై ఇప్పుడే కర్చీఫ్?

పోలీసులపై అంబటి ఆగ్రహం

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

పోలీసులపై వైసీపీ నేతల విమర్శలు

అంబటి వ్యాఖ్యలపై టీడీపీ సెటైర్లు

# ఎర్రజెండాలన్నీ ఏకమైతే.. గెలుపు మనదే!

**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** కమ్యూనిస్టుల ఐక్యతపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టులు చీలిపోవడంతోనే ఎన్నికల్లో గెలవడం లేదన్నారు. కమ్యూనిస్టులు అంతా కలిసి పని చేస్తే గెలుపు సాధ్యమేనన్నారు. కమ్యూనిస్టు జండాలు ఏకమైతే ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. విడివిడిగా ఉండి ఎలక్షన్స్ లో గెలుస్తామంటే కుదరదన్నారు. ఎర్రజెండాలన్నీ ఏకమైతే ఈ దేశంలో పెట్టుబడిదారి విధానానికి ప్రత్యామ్నాయంగా సోషలిజం ఉంటుందన్నారు. ప్రశ్నించే తత్వం ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. ఏ ఉద్యమానికైనా కమ్యూనిజమే మూలం అన్నారు. చిన్న చిన్న సంఘాల ఎన్నికల్లో కమ్యూనిస్టులు గెలుస్తున్నారు. కానీ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తోందని అందువల్లే గెలుపు సాధ్యం కావడం లేదన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ప్రాధాన్యం:

తెలంగాణలో త్వరలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టుల మద్దతు కోరుతోంది. ఈ విషయంలో మొన్ననే సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హైదరాబాద్?లో కలిసి మద్దతు కోరారు. ఇక సీపీఐ గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీకి మిత్ర పక్షంగా కొనసాగుతోంది. ఓ వైపు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికార కాంగ్రెస్ కమ్యూనిస్టుల మద్దతు కోరుతున్న వేళ ఎర్రజెండాలు ఏకం కావాలంటూ సీపీఐ అగ్రనేత ఇచ్చిన పిలుపు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్ లో సంచలనంగా మారింది. నిజానికి కమ్యూనిస్టులు ఏకం కావాలనే చర్చ చాలా రోజులుగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కూనంనేని తాజా వ్యాఖ్యలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కీలక పరిణామానికి దారి తీయబోతున్నాయనే అనే చర్చ తెరమీదకు వస్తోంది.

# ఉద్యోగుల శ్రమను దోచుకుంటే ఊరుకోం!

మొదటి పేజీ తరువాయి

కొందరు ఉద్యోగుల జీతాలు తగ్గించి మరికొందరి వేతనాలు మాత్రం పెంచారని.. ఉద్యోగుల పట్ల ఇంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. ఉద్యోగుల వేతనాల కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సమయానికి ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగుల శ్రమను దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగుల విషయంలో ఏం జరిగిందో రివ్యూ చేసి ఉద్యోగుల జీతాలు పెంచాలని హెల్త్ మినిస్టర్ కు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఏటా 5 శాతం జీతాలు పెంచాలని కేంద్ర నిబంధనల్లో ఉన్నప్పటికీ జీతాలు తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎన్ హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదన్నారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎన్ హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని.. అందులో కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ కూడా ఉందన్నారు. ఏపీలో 30 శాతం జీతాలు పెంచడంతో పాటు రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు ఇవ్వాల్సిన నిధులను పక్క దారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఉద్యోగులందరి జీతం పెంచి.. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా ఉద్యమం తప్పదు

గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు ఎన్ హెచ్ఎంలు ఎంతో కీలకమని అన్నారు. వ్యాక్సినేషన్ తో పాటు రాష్ట్ర ప్రజలకు స్థానికంగా వైద్య సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులు ఒక్క రోజు పని మానేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ దెబ్బ తింటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. వేతనాల తగ్గింపు పై ఉద్యోగుల ధర్నా చేస్తామని కోరినా పర్మిషన్ ఇవ్వడం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వారికి అపాయింట్ మెంట్ కూడా ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము రంగంలోకి దిగి పెద్ద ఎత్తున వారి తరఫున ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# చంద్రబాబు కనుసన్నల్లో ఎస్ఈసీ

మొదటి పేజీ తరువాయి

కేవలం రెండ్రోజుల క్రితమే రిజర్వేషన్లు ప్రకటించి, కేవలం 24 గంటల్లోనే నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. ప్రతిపక్షానికి కనీసం అభ్యర్థిని ఎంచుకునే సమయం కూడా ఇవ్వకుండా, ఎక్కడ ఏ రిజర్వేషన్ ఉంటుందో ఎలా తెలుస్తుందని నిలదీశారు. అభ్యర్థులపై పోలీసుల కాల్పులు జరపడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన ఆయన, తమ అభ్యర్థులను కనీసం నామినేషన్ వేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు నిజాయితీగా ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని, కేసులు పెడతామని తమ అభ్యర్థులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి నేతలే దగ్గరుండి మిత్రపక్షాలకు అన్నీ సమకూరుస్తున్నారని, ఆర్ఓలు సైతం నామినేషన్లు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎస్ఈసీ నిద్రపోతుంటే రాష్ట్రంలో రాజ్యాంగం ఉన్నట్టా అని ఘాటుగా ప్రశ్నించారు.

ఈ సందర్భంగా గత తమ ప్రభుత్వాన్ని ఉదాహరణగా చూపుతూ.. తాము అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికలు జరిగినపుడు నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఎస్ఈసీగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయన చేతిలో పూర్తి అధికారాలు ఉండటం వల్ల కలెక్టర్లు, ఎస్పీలను సైతం బదిలీ చేశారని, అయినప్పటికీ తాము ఎలాంటి భయాలకు తావులేకుండా ఎదుర్కొని 13 మున్సిపల్ కార్పొరేషన్లను క్లీన్ స్వీప్ చేశామని, 85 శాతం డివిజన్లను కైవసం చేసుకున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వానికి ఎలాంటి వివక్ష లేకుండా, నిబద్ధతతో ఎన్నికలు జరిపించే దమ్ము, ధైర్యం లేవని వైఎస్ జగన్ విమర్శించారు. తప్పులు టీడీపీ చేసి.. నిందలు మాత్రం తమపై వేస్తోందని మండిపడ్డారు. పుంగనూరు ఘటనను తప్పుదారి పట్టించాలని చూశారని, మిథున్ రెడ్డి కారులో పోలీసులే మద్య బాటిళ్లు పెట్టారని జగన్ ఆరోపించారు.

# సర్వీసు రికార్డులపై సర్కారు ఫోకస్!

మొదటి పేజీ తరువాయి




ఈ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించిన పూర్తి సర్వీసు వివరాలను డిజిటల్ సర్వీస్ రిజిస్టర్ (డీఎస్ఆర్) రూపంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగి నియామకం నుంచి పదవీ విరమణ వరకు సర్వీసుకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ విధానంలో అందుబాటులో ఉంచడం ఈ వ్యవస్థలో కీలక అంశంగా ఉండనుంది.

ఈ-హెచ్ఆర్ఎంఎస్ అమలుతో ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన పలు కీలక కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. సెలవుల మంజూరు, వార్షిక ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, బదిలీలు వంటి సాధారణ సర్వీసు వ్యవహారాలతో పాటు వార్షిక రహస్య నివేదికలు, వార్షిక పనితీరు మదింపు నివేదికలు, స్థిరాస్తుల వివరాల సమర్పణ, విజిలెన్స్‌కు సంబంధించిన వ్యవహారాలు, పదవీ విరమణ కేసులను కూడా ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు. తద్వారా ఉద్యోగుల సర్వీసు వివరాల పరిశీలన, సంబంధిత ప్రతిపాదనల ఆమోదం, పరిష్కార ప్రక్రియలను ఒకే డిజిటల్ వేదిక ద్వారా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఈ-హెచ్ఆర్ఎంఎస్ వ్యవస్థలో దస్త్రాల ప్రారంభం నుంచి వాటి పరిశీలన, ఆమోదం, పరిష్కారం వరకు నిర్దేశిత విధానాన్ని అనుసరించనున్నారు. దీనివల్ల ప్రతి దశలో దస్త్రాల పురోగతిని పర్యవేక్షించడం, పెండింగ్‌లో ఉన్న వ్యవహారాలను గుర్తించడం సులభమవుతుందని భావిస్తున్నారు. ఈ వ్యవస్థ అమలును పర్యవేక్షించే బాధ్యతలను ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్‌కు ప్రభుత్వం అప్పగించింది.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకే విధమైన డిజిటల్ విధానాన్ని అమలు చేయడం ద్వారా సర్వీసు రికార్డుల నిర్వహణలో ఏకరూపత తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రావడం, ఉద్యోగుల పాత రికార్డులను డిజిటల్ రూపంలోకి మార్చడం, వివరాల కచ్చితత్వాన్ని నిర్ధారించడం వంటి అంశాలు కీలకం కానున్నాయి. ఈ మార్పులతో ఉద్యోగుల సర్వీసు సంబంధిత పనులు వేగంగా పూర్తవడంతో పాటు పరిపాలనా సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉంది.

# కోల్‌కతా తొక్కిసలాట

## ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు!



**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** పశ్చిమబెంగాల్ కోల్ కతా చోర్ బగాన్ లోని దుర్గమాత మండపం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 19 కి చేరుకుంది. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిర్వాహకులతో సహా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే, హత్యకు దారితీయని నేరపూరిత మానవ హత్య కేసును పోలీసులు సుమోటోగా నమోదు చేశారు. శనివారం సాయంత్రం భారీ వర్షం కురుస్తున్న సమయంలో రాత్రి 7.40 గంటల ప్రాంతంలో చోర్‌బాగన్ దుర్గా పూజ మండపం వద్ద ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. పది రోజుల పాటు జరిగే హిందూ పండుగలో ఏడో రోజైన సప్తమి సందర్భంగా మండపాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో తొక్కిసలాట జరిగినట్లు తెలుస్తోంది.

**బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం:**

ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలలోని ఒకరికి ప్రభుత్వం ఉద్యోగంతో పాటు రూ.25 లక్షల పరిహారం అందజేయనున్నట్లు సీఎం సువేందు అధికారి హామీ ఇచ్చారు. సీఎం, సీఎస్ కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారికి అయ్యే పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఘటనపై దర్యాప్తునకు కలకత్తా హైకోర్టుకు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని, ఫ్యాక్ట్-ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సిట్‌లో ఎస్‌టీఎఫ్, సీఐడీ సహా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

**లౌడ్ స్పీకర్ ప్రకటనతోనే తొక్కిసలాట?**

చోర్‌బాగన్ దుర్గా పూజ నిర్వాహకులు చేసిన ప్రకటన కారణంగానే భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో ఈ దుర్ఘటన జరిగిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. కోల్‌కతా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అయితే, లౌడ్ స్పీకర్‌లో అసలు ఏ ప్రకటన చేశారనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. మృతుల్లో ఇద్దరి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది విజిల్ ఊదడంతో భక్తుల్లో ఒక్కసారిగా కదలిక పెరిగి తొక్కిసలాటకు దారితీసినట్లు తెలుస్తోందని సీఎం వెల్లడించారు. దుర్గా పూజ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లపై సీఎం సువేందు అధికారి కీలక సూచనలు చేశారు. థీమ్ ఆధారంగా ఏర్పాటు చేసే మండపాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలని, సందర్శకుల రాకపోకలకు సరిపడా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. థీమ్ పూజల పేరుతో కొన్ని మండపాల్లో వెలుతురు తగ్గిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. థీమ్‌ల కంటే ప్రజల ప్రాణాలే విలువైనవని స్పష్టం చేశారు.

# స్పెషల్ బస్సుల పేరుతో నిలువు దోపిడీ!

మొదటి పేజీ తరువాయి



అందుకు సంబంధించిన ఆర్టీసీ టికెట్ ను కూడా ఆయన ట్వీట్ లో పెట్టారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి, జేబులు గుల్ల చేసి, ప్రజలకు పండుగ సంబరం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్ గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి.. పురుషుల నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేయడానికి సిగ్గనిపించడంలేదా అని నిలదీశారు. భార్యకు ఫ్రీ టికెట్.. భర్తకు డబుల్ టికెట్ వసూలు చేస్తే, మహిళలకు రాయితీ ఇచ్చినట్టా? లేక ఆ భారాన్ని తిరిగి అదే కుటుంబంపై మోపినట్టా? ఒక చేత్తో ఉచిత ప్రయాణం.. మరో చేత్తో డబుల్ దోపిడీ. ఇదేనా మీ ప్రజాపాలన? అని ప్రశ్నించారు.

మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారని, ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ.. ప్రజల నడ్డి విరుస్తున్నారని వాపోయారు. రేవంత్ ప్రభుత్వ తీరుతో పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలంటేనే పేద, మధ్యతరగతి ప్రజలు భయపడే దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి.. పండుగల పేరుతో పెంచిన అడ్డగోలో ఛార్జీలను తగ్గించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# నూడుల్స్ మిస్టరీలో కొత్త కోణం!



**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా పరిధిలో రాత్రి నూడుల్స్ తిని పడుకున్న వారిలో తెల్లారేసరికి ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన మహేశ్ (37), ఆయన భార్య లలిత (35), వారి ముగ్గురు పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షాత్ (3) తమ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో శవాలై కనిపించడం తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం రాత్రి రామ్‌లీలా ఉత్సవాలు చూసి ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం వారంతా నూడుల్స్ తిని పడుకున్నారని, శనివారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో స్థానికులు కిటికీలోంచి చూడగా విగత జీవులుగా పడి ఉన్నారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసు ఉన్నతాధికారులు, ఫోరెన్సిక్, ఆహార భద్రతా విభాగం నిపుణులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే ఈ హృదయ విదారక ఘటన లో ఊహించని మలుపు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వంటింట్లోని ఆహార నమూనాలను సేకరించగా, ఫుడ్ పాయిజనింగ్ సాధారణ లక్షణాలైన వాంతులు, విరేచనాలు వంటి గుర్తులు లేకపోవడంతో ఇది విషప్రయోగమా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ మరణాల వెనుక కుటుంబంలో నెలకొన్న తీవ్ర ఆస్తి వివాదాలే కారణమని స్థానికులు, బంధువులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. మహేశ్ వృద్ధురాలైన తల్లి చంద్రావతి కూడా అదే ఇంట్లో ఉంటున్నప్పటికీ ఆమెకు ఎలాంటి హానీ జరగలేదు. మహేశ్ నివసిస్తున్న ఇంటితో సహా కుటుంబ ఆస్తులన్నింటినీ తల్లి తన కూతుళ్ల పేరిట బదిలీ చేసిందని, ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ రోజూ కొడుకు, కోడలితో తీవ్రంగా గొడవపడేదని స్థానికులు వెల్లడించారు. ఆ రాత్రి స్వయంగా తల్లే నూడుల్స్ వండి కుటుంబ సభ్యులందరికీ వడ్డించిందని, తాను మాత్రం తినలేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆస్తి వివాదం నేపథ్యంలోనే ఆహారంలో ఏదైనా విషపదార్థం కలిపారా అన్న కోణంలో పోలీసులు మహేశ్ తల్లిని, ఇతర బంధువులను విచారిస్తున్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాతే ఈ మిస్టరీ మరణాలకు గల అసలు కారణాలు వెలుగులోకి రానున్నాయి.

# ఏపీని సౌత్ బీహార్ చేస్తున్నారు: షర్మిల!




**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీలు రాష్ట్రంలో దారుణమైన రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా కూటమి ప్రభుత్వం, ఎన్నికల సంఘం, పోలీసుల తీరును కూడా తీవ్రంగా తప్పుబట్టారు. గత వైసీపీ హయాంలో జరిగిన హింసాకాండను మించిన ఘోరకలి ప్రస్తుత టీడీపీ పాలనలో జరుగుతోందని షర్మిల అన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారని, ప్రతీకార రాజకీయాలతో రతనాల సీమను రక్తసీమగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో శాంతియుత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మార్చేశారని మండిపడ్డారు. నామినేషన్ల తొలిరోజు రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘటనలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే ఆందోళనకరమైన పరిణామాలని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానిది పవిత్ర పాలనైతే ఈ దాడులు, బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు జరుగుతున్నాయని షర్మిల సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. అదే సమయంలో నామినేషన్ కేంద్రాల దగ్గర రౌడీలు, గూండాలు ఉంటే ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ ఏం చేస్తున్నాయని? ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ దౌర్జన్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు.

ఇలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, అర్హత, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం వార్నింగ్..

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల వేళ జరుగుతున్న ఘర్షణలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా ఇప్పటికే స్పందించారు. విజయవాడలో పోలీసు, ఎన్నికల ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్యూటీలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులను సస్పెండ్ చేసి బదిలీ కూడా చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. పుంగనూరు, రాయచోటిలో జరిగిన అల్లర్లపై రిపోర్ట్ అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పునేఠా చెప్పారు.

# భక్తులపైకి ట్రక్కు.. 12 మంది బలి!

మొదటి పేజీ తరువాయి

స్థానికులు, గ్వాలియర్ ఎస్పీ ధర్మవీర్ సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో చిన్నిర్ వైపు నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఒక వస్తున్న భారీ ట్రక్కు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లడంతో 12 మంది అక్కడికక్కడే మృతి చెందారు.

ఆ మార్గంలో భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం ఉన్నప్పటికీ, లారీ అక్కడున్న పోలీస్ బారికేడ్లను, చెక్‌పోస్టును బద్దలుకొట్టుకుంటూ వేగంగా దూసుకొచ్చిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తులను తొక్కుకుంటూ వెళ్లడమే కాకుండా, శీతలా మాత ఆలయ ప్రహరీ గోడను, ప్రధాన గేటును బలంగా ఢీకొట్టింది. దీంతో గోడ కూలి కొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నేనే హోంమంత్రిని: అంబటి వార్నింగ్!



**న్యూస్ డెస్క్, 18 అక్టోబర్ (తెలుగు గళం):** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. గుంటూరులో వైసీపీ మేయర్ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లలో తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరవాత తానే మొదటి ఆరు నెలలు హోంమంత్రిగా ఉంటానని హెచ్చరించారు. ఇక్కడ అందరూ మంచోళ్లే కానీ ఒక్కడు మాత్రం అంటూ అక్కడ నుండి పక్కకు వెళ్లిపోయారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

దీంతో అంబటి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ప్రభుత్వం వస్తే తానే హోం మంత్రి అని చెప్పడంతో ఆయన హోంమినిస్ట్రీపై ఇప్పుడే కర్చిఫ్ వేశారంటూ టీడీపీ కార్యకర్తలు, అభిమానులు విమర్శిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో నామినేషన్ల వేళ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. దీంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణల్లో పోలీసులపై సైతం వైసీపీ నేతలు విమర్శలు కురిపిస్తున్నారు. పోలీసులు టీడీపీ వాళ్లకు ఫేవర్ గా ఉంటున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు.

# మద్దతు రాజకీయం మస్తు టెన్షన్!

మొదటి పేజీ తరువాయి

జనసమితి కాంగ్రెస్ కు మద్దతుపై సానుకూలంగా స్పందించగా సీపీఎం మాత్రం నల్లగొండ- వరంగల్- ఖమ్మం స్థానం నుంచి ఎలాగైనా పోటీచేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ సీటు విషయంలో ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వడమా? తటస్థంగా ఉండటమా? పోటీచేయడమా? అనే దానిపై దసరా తర్వాత మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, గతంలో హైదరాబాద్ స్థానం నుంచి ప్రొఫెసర్ నాగేశ్వర్ విజయం సాధించడంలో సీపీఎం కీలక పోషించింది. ఇక్కడి నుంచి ఆయన రెండుసార్లు గెలుపొందారు. అయితే ఈ సారి మాత్రం పోటీపై ఇంకా స్పష్టత రాలేదని సమాచారం.

మద్దతుపై సస్పెన్స్!

రాష్ట్రంలో కాంగ్రెస్?పార్టీకి.. సీపీఐ, తెలంగాణ జనసమితి పార్టీ మిత్రపక్షాలుగా కొనసాగుతున్నాయి. ఈ రెండు పార్టీలు తమకు మద్దతు తెలుపుతాయని దీమాలో కాంగ్రెస్?నేతలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లోనూ సీపీఐ తన మద్దతు కొనసాగించింది. ఈ నేపథ్యంలో వారి మద్దతు లభిస్తుందనే అంచనా వేస్తున్నారు. సీపీఎం మద్దతు సైతం లభిస్తే ఈ రెండు స్థానాలను అత్యంత సులభంగా గెలవవచ్చని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే సీపీఎం మద్దతుపై సస్పెన్షన్ కొనసాగుతుందని ఆ పార్టీవర్గాలు చెబుతున్నాయి.

దసరా తర్వాతే నిర్ణయం

బీఆర్ఎస్ సైతం తమ మద్దతు కోరిందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ వెల్లడించారు. వరంగల్- నల్లగొండ- ఖమ్మం స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు తెలపాలని, సీపీఎం అభ్యర్థి హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ లో పోటీచేస్తే తమ పార్టీ మద్దతిస్తామని బీఆర్ఎస్ నేతలు ప్రతిపాదించినట్టు ఆయన వెల్లడించారు. దీంతో సీపీఎం మద్దతు ఇరుపార్టీలకు కీలకంగా మారింది. అయితే సీపీఎం మాత్రం వరంగల్- నల్లగొండ- ఖమ్మం స్థానం నంచి పోటీచేయాలనే పట్టుదలతో ఉన్నట్టు సమాచారం. గెలుపోటములతో సంబంధం లేకుండా ఈ మూడు జిల్లాల్లో తమకు ఓటు బ్యాంకు ఉందని, ఆ ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం పోటీచేయాలని భావిస్తున్నట్టు సమాచారం. శనివారం సాయంత్రం సీపీఎం సెక్రెటేరియట్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. దసరా పండగ తర్వాత రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం కీలక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. అంతకుముందే సీపీఐతో పాటు ఇతర వామపక్షాల పార్టీల నేతలతో సీపీఎం నేతలు సంప్రదింపులు జరపనున్నారు.

## మహాలక్ష్మి పథకం, పండుగ బస్సుల

# నిర్వహణలో లోటుపాట్లు లేవు

### హరీశ్ రావు ఆరోపణలపై టీజీఎస్ ఆర్టీసీ స్పష్టత

హైదరాబాద్, అక్టోబర్ 18 (తెలుగు గళం న్యూస్)

మహాలక్ష్మి పథకం అమలు, పండుగ ప్రత్యేక బస్సుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా సంస్థ నిర్వహణపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది.పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా టికెట్ ధరల నియంత్రణ, ఇతర నిర్ణయాలు 2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం నిబంధనలకు లోబడి తీసుకుంటున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది.ప్రయాణికులపై అదనపు భారం పడకుండా నిబంధనల మేరకే నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు తెలిపింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతోందని, మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది.దసరా పండుగ సందర్భంగా బస్సు సర్వీసులను తగ్గించలేదని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి ప్రత్యేకంగా 7,000 అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.అక్టోబర్ 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపింది.సంస్థ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా టీజీఎస్ ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు




## చాగల్లు గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### నూతన బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్సై రాజేష్





తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 18

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు, యువతీ యువకులు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ సందడిని మరింత పెంచారు.పండుగను పురస్కరించుకుని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా అలంకరించారు.అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, పూల అలంకరణలతో గ్రామంలో పండుగ శోభ వెల్లివిరిసింది.చిన్నారులు సైతం ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నూతన బతుకమ్మ విగ్రహాన్ని ఎస్సై రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు.సంప్రదాయ పండుగలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామంలో నూతన బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం గ్రామంలో ఐకమత్యానికి, సామాజిక భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది.స్థానిక కౌన్సిలర్లు బలగాని అనిల్, పొన్న రాజేష్, సౌదరపెల్లి సంపత్ రాజ్, కొంతం సుమలత కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వారి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు సమష్టిగా పాల్గొని సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు.పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూల బతుకమ్మలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది.తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామ ప్రజలు ఐకమత్యంతో వేడుకలు నిర్వహించడం విశేషం. బతుకమ్మ పండుగ మహిళలందరినీ ఒకచోట చేర్చి, పరస్పర ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.సద్దుల బతుకమ్మ వేడుకలతో చాగల్లు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.పూలతో అలంకరించిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలు, ఆటపాటలు, గ్రామ ప్రజల ఉత్సాహం మధ్య వేడుకలు కనులపండువగా సాగాయి. గ్రామ ప్రజలంతా కలిసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో చాగల్లులో బతుకమ్మ సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## స్టేషన్ ఘన్‌పూర్ మండల వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆటస్థలాలకు తీసుకువచ్చారు.మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. డీజే పాటల నడుమ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంది.



స్టేషన్ ఘన్పూర్ లో బతుకమ్మలతో మహిళలు



పాముసూరు గ్రామంలో...

### పాముసూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

స్టేషన్ ఘన్‌పూర్ మండలం పాముసూరు గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గ్రామంలోని ఆటస్థలానికి చేరుకున్నారు.మహిళలు, పిల్లలు, పురుషులు కలిసి డీజే పాటల నడుమ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.గ్రామస్థులంతా కలిసికట్టుగా పాల్గొని సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామంలో ఆనందోత్సాహాలను నింపాయి.

## జఫర్‌గఢ్ మండల వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

### రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్పు..డీజే పాటలతో మహిళల సందడి

### గ్రామాల్లో పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన సర్పంచులు



తెలుగు గళం న్యూస్ జఫర్‌గఢ్ అక్టోబర్ 18

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.మహిళలు, పిల్లలు, పురుషులు అనే తేడా లేకుండా అందరూ కలిసి పండుగలో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, డీజే పాటల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పండుగను వైభవంగా జరుపుకున్నారు.మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అలాగే తమ్మడపల్లి జి, జఫర్‌గఢ్,షాపల్లి, రఘునాథపల్లి, కూనూరు, తిడుగు, సాగరం, ఓబులాపూర్, హిమ్మత్ నగర్, తిమ్మాపూర్, సూరారం, పెద్ద తండా, తీగారం, కోణాయచలం, తిమ్మంపేట, శంకర్ తండా, రేగడి తండా, తమ్మడపల్లి ఐ తదితర గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.గ్రామాల్లో పండుగను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు ఆనందంగా జరుపుకునేలా ప్రభుత్వం తరఫున సర్పంచులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు మండల వ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని నింపాయి.



## దుర్గాష్టమి సందర్భంగా నిరుపేద పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ




శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 ( తెలుగు గళం న్యూస్ ) న్యూస్: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని దర్శ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు యూసఫ్ గూడా రహమత్ నగర్ బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని దర్శ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శివమాలతి భూపతి తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిరుపేద పిల్లలు పండుగలకు సంతోషాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేయడం వారి ముఖాల్లో ఆనందాన్ని చూడడంతో పాటు సామాజిక సేవ పట్ల తమకున్న నిబద్ధతను చాటుకుంటున్నామని తెలిపారు సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం అవసరమైన వారికి సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం సోదర భావం పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో దర్శ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శివ మాలతి భూపతి తో పాటు ట్రస్ట్ సభ్యులు శివ సాయి కుమార్ భూపతి సాయికుమార్ గణేష్ కృష్ణ కుమార్ శర్మ ఆకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు




## నల్లబెల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తెలుగు గళం న్యూస్
వర్ధన్నపేట/అక్టోబర్ 18



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు సంప్రదాయ పట్టు చీరలలో, రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, భక్తి శ్రద్ధలతో గౌరమ్మను పూజించారు. బతుకమ్మల చుట్టూ కోలాటం ఆడుతూ,బతుకమ్మ పాటలు పాడుతూ గౌరమ్మను ఘనంగా సాగనంపారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. ప్రకృతిని,పూలను పూజించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగ. ఈ పండుగ ఆడబిడ్డలలో ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తుంది.

చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కేవలం పూల పండుగ కాదు, అది మన తెలంగాణ సంస్కృతి,మన ఆడపడుచుల ఆనందం. ప్రకృతిని కాపాడుకుంటూ, సంప్రదాయాలను భావి తరాలకు అందించాలనే సందేశాన్ని సద్దుల బతుకమ్మ అందిస్తోంది. అని మహిళలు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ఉప సర్పంచ్ మేకల దేవేందర్ వార్డు మెంబర్లు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నారాయణగిరిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు.. ఆటపాటలతో మహిళల సందడి



ధర్మసాగర్, అక్టోబర్ 18 (తెలుగు గళం): ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా కొనసాగిన బతుకమ్మ సంబరాలు చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ఉత్సాహభరితంగా ముగిశాయి.ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ,ఆటలాడుతూ సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్తులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను చాటిచెప్పింది. గ్రామ మహిళలు, యువతీ యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక కుమారస్వామి, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, మహిళలు, యువతీ యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# తమ్మడపల్లి ఐ చెరువు మత్తడి ధ్వంసం... అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం!

**నాసిరకం పనులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
**మత్తడి పునర్నిర్మాణంతో పాటు రహదారి, బస్సు సౌకర్యాలు కల్పించాలి**
**బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ డిమాండ్**





జాఫర్‌గఢ్, అక్టోబర్ 18 (తెలుగు గళం)

చెరువు అభివృద్ధి పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నా..క్షేత్రస్థాయిలో మాత్రం నాసిరకం పనులు దర్శనమిస్తున్నాయని, తమ్మడపల్లి ఐ గ్రామంలో ధ్వంసమైన చెరువు మత్తడి ఇందుకు నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.చెరువు మత్తడి ధ్వంసమవడంతో నీటి నిల్వలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని, దీనివల్ల రైతులు, గ్రామ ప్రజలు నష్టపోయే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, ధ్వంసమైన మత్తడిని నాణ్యతా ప్రమాణాలతో పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపి, నాసిరకం పనులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఒకప్పుడు వెలుగు వెలిగిన గ్రామం.. నేడు కనీస సౌకర్యాలకూ దూరం!**

ఒకప్పుడు చుట్టుపక్కల గ్రామాలకు వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన తమ్మడపల్లి ఐలో ప్రకృతి చికిత్సాలయం, పశువుల వైద్యశాల, సహకార బ్యాంకు వంటి సౌకర్యాలు ఉండేవని నగేష్ గౌడ్ గుర్తుచేశారు.అలాంటి గ్రామం నేడు కనీస రహదారి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుండటం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు.గ్రామాభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**రహదారి లేదు.. బస్సు సౌకర్యం లేదు.. ప్రజల ఇబ్బందులు పట్టించుకునేదెవరు?**

తమ్మడపల్లి ఐ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రహదారిని పునర్నిర్మిస్తే వెంకటాపూర్, రఘునాథ్‌పల్లి, కూనూరు, ఉప్పుగల్లు గ్రామాల ప్రజలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు మండల కేంద్రానికి చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. గ్రామానికి సరైన రహదారితో పాటు బస్సు సౌకర్యం కల్పించకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా హామీలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగేష్ గౌడ్ డిమాండ్ చేశారు. చెరువు మత్తడిని యుద్ధప్రాతిపదికన పునర్నిర్మించాలని, చెరువులోకి నీరు చేరే కాలువలను పునరుద్ధరించాలని, రహదారిని అభివృద్ధి చేసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.తమ్మడపల్లి ఐ గ్రామ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# దశదిన ఖర్మ కు హాజరైనా సమ్మయ్య గౌడ్.

**నాన్న మరణించిన కొన్ని సంవత్సరాలకు అమ్మ మృతి.. కన్నీటి సంద్రంలో ఇద్దరు కుమార్తెలు**
**ఇంటి పరిస్థితి చూసి తక్షణ సాయం.. ఇంటిపై తాటిపత్రి కప్పించి, క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందజేసిన మండల అధ్యక్షులు**
**బలహీన వర్గాలకు మండల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది - మండల అధ్యక్షులు సమ్మిగౌడ్**
**తల్లిదండ్రులను కోల్పోయి.. అనాథలుగా మారిన కుమార్తెలు**

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన జనగాం కవిత భర్త యాకయ్య మరణించిన కొద్ది సంవత్సరాలకే కవిత కూడా అనారోగ్య కారణాలతో అక్టోబర్ 17న మృతిచెందారు. వరుసగా తల్లిదండ్రులను కోల్పోవడంతో వారి కుమార్తెలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఇద్దరు ఆడపిల్లలు చిన్నవాళ్లు అవ్వడం తో కన్నతల్లి దశదిన ఖర్మ కూడా చేసే పరిస్థితి లేదు అని గ్రామ మాజీ సర్పంచ్ యాకన్న యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మద్రి వెంకట్రావు మండల పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ..ఇద్దరు ఆడపిల్లల తల్లి మరణవార్త విని వారి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కన్నవారిని కోల్పోయిన పిల్లల దీనస్థితి, నివాసానికి సరైన సౌకర్యాలు లేకపోవడం ఆయనను కలచివేసింది..ఆ కుటుంబం నివసిస్తున్న ఇంటి పరిస్థితిని చూసిన సమ్మయ్య గౌడ్ తక్షణమే స్పందించారు. ఇంటిపై తాటిపత్రి కప్పించే ఏర్పాట్లు చేయించడంతో పాటు, అర క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, పిల్లలు ఒంటరివారమనే భావనకు లోనుకాకుండా ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా బాలికతో మాట్లాడిన సమ్మయ్య గౌడ్..తనకు సాధ్యమైన సహాయం అందిస్తూ తల్లిదండ్రులను కోల్పోయిన ఆ ఆడబిడ్డలకు అండగా ఉంటానని,పెద్ద కూతురు పెళ్లి అవ్వగా,చిన్న బిడ్డ పెళ్లికి కూడా భవిష్యత్ లో సహాయం చేస్తానని భరోసా కల్పించారు. "కష్టాలు వచ్చాయని చదువును మధ్యలో ఆపవద్దు.. నువ్వు చదువుకోవాలి.. నీ భవిష్యత్తుకు నేను అండగా ఉంటాను" అంటూ బాలికలో ధైర్యాన్ని నింపారు..ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం అందించడమే కాకుండా, చదువు మానేసిన బాలిక భవిష్యత్తుపై బాధ్యతతో స్పందించిన సమ్మయ్య గౌడ్ తీరును స్థానికులు అభినందించారు. కన్నవారిని కోల్పోయిన ఆ ఇద్దరు కుమార్తెల జీవితాల్లో ఈ సహాయం దశదిన ఖర్మ కార్యక్రమానికి చాలా సహాయం అవుతుందని,పిలిచిన వెంటనే వచ్చి సహాయం చేసిన మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ గ్రామస్థులు అభినందించారు..ఈ కార్యక్రమంలో వెంకటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్రి వెంకట్రావు, మాజీ సర్పంచ్ సుజాత యాకన్న, మాజీ ప్రజాప్రతినిధి మారం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పోల్సాని విక్రమ్, ఇంటికన్నె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, ఇంటికన్నె యూత్ అధ్యక్షుడు వర్ధంతి రంజిత్, కాంగ్రెస్ పార్టీ యువకులు జగదీష్, బానోతు అమిలాల్, అంబాల శరత్, జనగాం సాయికుమార్, పందుల రాజు, మల్లూరి రాజు, అశోక్, సీనియర్ నాయకులు రాంపల్లి వెంకన్న, నల్లవాసప్పులయ్య, మిట్టకడుపుల యాకయ్య, కత్రి కిషన్ తదితరులు పాల్గొన్నారు





# కురవి వీరభద్ర స్వామిని దర్శించుకున్న మాజీ చైర్మన్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



కొరవి మండల కేంద్రంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,బిల్డింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఉత్సవ కమిటీ వారు ఆహ్వానం మేరకు దుర్గ భవాని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన. మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు వారి వెంట టియుడబ్ల్యూజే ( ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, కొరవి మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్, శ్రీను,శరత్, సంతోష్, ప్రశాంత్ రాయల్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# జనగామ బతుకమ్మ కుంటలో ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలు

తెలుగు గళం న్యూస్ జనగామ, అక్టోబర్ 18



జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంటలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా గౌరవ మున్సిపల్ చైర్మన్ తనకంచి బాలమణి శ్రీనివాస్, 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి తమ సోదరీమణులతో కలిసి బతుకమ్మ ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఘనంగా నిర్వహించారు.

# నారాయణగిరిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు!

**ఆటపాటలు, కోలాటాలతో మహిళల సందడి.. కుటుంబ సభ్యులతో పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బత్తిని ఎల్లగౌడ్**



ధర్మసాగర్, అక్టోబర్ 18 (తెలుగు గళం):

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,వాటి చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు.తొమ్మిది రోజులపాటు కొనసాగిన బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకల్లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బత్తిని ఎల్లగౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.కుటుంబాలు సుఖసంతోషాలతో, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని గౌరమ్మను ప్రార్థించారు.తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రకృతితో మానవ సంబంధానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పలువురు పేర్కొన్నారు.గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు పండుగ వాతావరణాన్ని నింపాయి.

# యాదగిరిగుట్టలో కన్నులపండువగా సద్దుల బతుకమ్మ



తెలుగు గళం,యాదగిరిగుట్ట, అక్టోబరు 18: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఎంతో ఉత్సాహంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. ఈ పండుగను పురస్కరించుకొని ఆదివారం రోజున పట్టణంలోని పలు కుటుంబాలు ఎంతో భక్తిశ్రద్ధలతో భారీ బతుకమ్మలను పేర్చి తమ విశిష్టతను చాటుకున్నాయి. పట్టణంలోని హనుమాన్ వాడకు చెందిన ఆలయ ఉద్యోగి దొమ్మాట రాంప్రసాదొడ్డి కుటుంబ సభ్యులు మరియు వారి ఇంటి ఆడపడుచులు కలిసి సుమారు 10 అడుగుల ఎత్తైన భారీ బతుకమ్మను రంగు రంగుల పూలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. దసరా నవరాత్రుల సందర్భాన్ని పురస్కరించుకుని తొమ్మిది రకాల అమ్మవారి రూపాలు ప్రతిబింబించేలా ఈ బతుకమ్మను తయారుచేయడం విశేషం. ఈ భారీ బతుకమ్మ తయారీలో దొమ్మాట రాంప్రసాదొడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, లావణ్య, నాగమణి, స్వప్న, సౌజన్య, నల్లా స్వరాజలక్ష్మి, ఈగ చంద్రకళ, మొగులపల్లి సారిక తదితరులు భాగస్వాములయ్యారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ బతుకమ్మను చూసేందుకు స్థానికులు విశేషంగా ఆసక్తి చూపించారు.

# కొండాపురంలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు!



తెలుగు గళం, మూటకొండూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు మండలం కొండాపురం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. గత తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా సాగిన ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిశాయి. ఊరిలోని ఆడపడుచులు, మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను ఎంతో అందంగా తీర్చిదిద్ది ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద గ్రామస్తులందరూ ఒక్కటై బతుకమ్మలను మధ్యలో ఉంచి, చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలతో, కోలాటాలతో ప్రాంగణాన్ని మారుమోగించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకల్లో కొండాపురం గ్రామానికి చెందిన కోట్ల లోహిత, నల్ల మహిత, ప్రజ్ఞా రెడ్డి, మంజుల, కళ్యాణి తదితరులు పాల్గొని సంబరాలను మరింత కోలాహలంగా మార్చారు.

# జంగారెడ్డిగూడెం కూటమి నామినేషన్




తెలుగు గళం : జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ చైర్మన్ పదవికి కూటమి అభ్యర్థిగా టీడీపీ తరపున రొంగలా అనూష నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా జంగారెడ్డిగూడెం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం దగ్గర నుంచి మున్సిపల్ అభ్యర్థితో పాటు కూటమి నాయకులందరితో కలిసి గంగానమ్మ గుడి మీదుగా భారీ ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యంలో గంగానమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తోపాటు రాష్ట్ర జిల్లా మండల పట్టణ. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.